www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 15 నవంబర్ 2025
5
పశ్చిమ గోదావరి



ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అంకితభావంతో కృషి చేస్తానని ప్రభుత్వ విప్, స్థానిక ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎంఎల్ఎ కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతోపాటు ఎంఎల్ఎ పాల్గొని ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. ఆయా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిశానిర్దేశంలో ప్రజా సంక్షేమం కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నానన్నారు.

చెలరేగుతున్న సైబర్ నేరగాళ్లు..!

అధికారులు, ప్రముఖులే టార్గెట్‌గా ఉచ్చు

మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ ఘటనతో మరోసారి చర్చనీయాంశం



ప్రజాశక్తి - నరసాపురం

సైబర్ నేరగాళ్లు చెగలరేగిపోతున్నారు. గతంలో పోలీసులమంటూ భయపెట్టి నగదు దోచేసిన ఘటనలు ఈ ప్రాంతంలో చోటుచేసుకున్నాయి. మొగల్తూరు తదితర పోలీస్ స్టేషన్లో కేసులు సైతం నమోదయ్యాయి. దీనిపై జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి బెదిరంపులకూ తలొగ్గకుండా తమకు సమాచారం ఇవ్వాలని పోలీసులు పదేపదే ప్రకటిస్తున్నా విద్యావంతులైన అధికారులే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతుండటం గమనార్హం.

2024 అక్టోబర్ 24న మొగల్తూరులోని పలువురు వ్యాపారులకు పోలీసులు అంటూ ఫోన్ చేసి భయ పెట్టి సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడ్డారు. ఎస్ఐ కుటుంబ సభ్యులు అనారోగ్యానికి గురయ్యారని, తాను ఎస్ఐ భాస్కర్‌రెడ్డిని అని, తాను తెలిపిన నెంబర్‌కు ఫోన్‌పే ద్వారా నగదును బదిలీ చేయాలని కోరడం అందరికీ తెలిసిందే. దీంతో ఒక వ్యాపారి వారు చెప్పిన నెంబరుకు రూ.60 వేల నగదు బదిలీ చేసి, ఆపై మోసపోయామని గుర్తించడంతో విషయం వెలుగుచూసింది.

ఈ ఏడాది మే ఐదో తేదీన మొగల్తూరు తహశీల్దార్ రాజ్‌కిషోర్‌ను సైబర్ నేరగాళ్ల బురిడీ కొట్టించే ప్రయత్నం చేశారు. తాను ఐఎఎస్ అధికారిని అంటూ గుర్తు తెలియని వ్యక్తి తహశీల్దార్‌కు ఫోన్ చేసి తన బంధువు స్థానిక పిహెచ్‌సి వద్ద ఉన్నాడని, అతనికి అత్యవసరంగా డబ్బులు అవసరమని, ఫోన్ నెంబర్ ఇచ్చి నగదు ఇవ్వాలని సూచించాడు. తహశీల్దార్ ఆ



మొగల్తూరు పోలీస్ స్టేషన్

నెంబర్‌కు కాల్ చేసి డబ్బు తీసుకొస్తున్నా అని చెప్పగా ఆ వ్యక్తి ఫోన్ స్విచ్చాఫ్ చేశాడు.

తాజాగా మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసును ఎసిబి అధికారులమని నమ్మించి డబ్బులు డిమాండ్ చేశారు. అది నమ్మి సబ్ రిజిస్ట్రార్ రూ.2 లక్షలు నగదు బదిలీ చేసి మోసపోయాడు. అయితే తర్వాత కూడా డబ్బు డిమాండ్ చేయడంతో తాను మోసపోయానని నిర్ధారించుకుని, చివరకు మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తాజాగా ఈ నెల 12వ తేదీన మొగల్తూరు తహశీల్దార్ తన విధులు ముగించుకుని ఇంటికెళ్లేందుకు సిద్ధమవుతుండగా సిసిఎల్ఎ కమిషనర్ కార్యాలయం నుండి మాట్లాడుతున్నాం అంటూ ఒకరు ఫోన్ చేశారు. పైఅధికారి కార్యాలయం నుండి కాల్ అనడంతో తహశీల్దార్ రాజ్‌కిషోర్ వారడిగిన ప్రశ్నలకు మర్యాద పూర్వకంగా సమాధానం ఇచ్చారు. మే నెలలో ఇలాంటి కాల్ తహశీల్దార్‌కు వచ్చి ఉండటంతో ఆయన అప్రమత్తమై ఫేక్ కాల్ గా గుర్తించి మాట్లాడారు.

సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న జిల్లా వాసులు

ఈ నెల ఏడో తేదీన విశాఖపట్నం ఎండాడ ప్రాంతంలో అంతర్జాతీయ సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు ఇచ్చి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్న పది మంది వ్యక్తులను సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో జిల్లాకు చెందిన కొవ్వలి వాసి కోదండ రామాంజనేయులు, భీమవరానికి చెందిన తోటకూర రాజకుమార్, నరసాపురానికి చెందిన మొహమ్మద్ గౌస్ షరీఫ్, మొగల్తూరు మండలం రామన్నపాలెంవాసి మైలాబత్తుల పవన్, కాళ్ల మండలం పెదఅమిరానికి చెందిన పెన్మెత్స ప్రసాదరాజు, విశాఖకు చెందిన కెవివి.నరేష్, తూర్పుగోదావరి జిల్లావాసి కె.శివవర్మలను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

డిఎస్‌పి డాక్టర్ శ్రీవేద



సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రజలకు ఫోన్ చేసి పోలీసులు అని డబ్బులు అడిగితే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వండి. సైబర్ మోసానికి గురైన బాధితులు 24 గంటల్లోపు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలి. సకాలంలో ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ చేసే అవకాశం ఉంది. బ్యాంకు అధికారులు, డిజిటల్ అరెస్టులు, పార్ట్ టైమ్ జాబ్స్, కస్టమర్ కేర్ ప్రతినిధులుగా మాట్లాడి మీతోనే మీ ఆన్‌లైన్ బ్యాంకింగ్, ఇ-వ్యాలెట్ ఓటీపీలు, యుపిఐ నెంబర్లు అని కాల్ చేసే వారి వలలో చిక్కుకోవద్దు. డిజిటల్ అరెస్టు అనే బెదిరింపులకు భయపడొద్దు. సోషల్ మీడియాలో వచ్చే రీల్స్, ప్రకటనలు వాట్సాప్‌లో వచ్చే లింకులను చూసి పెట్టుబడులు పెట్టొద్దు. అనుమతి లేకుండా ఎవరైనా వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో ఎవరైనా చేరిస్తే వెంటనే లెఫ్ట్ కావాలి.

గరగపర్రు అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించాలి

- డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు చొరవ తీసుకోవాలి
- మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ విజ్ఞప్తి
- అంబేద్కర్ విగ్రహం పట్ల వివక్ష తగదు
- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు
- గరగపర్రు అంబేద్కర్ విగ్రహాన్ని పరిశీలించిన కెవిపిఎస్ బృందం

ప్రజాశక్తి - భీమవరం

గరగపర్రు అంబేద్కర్ విగ్రహాన్ని తక్షణం ప్రారంభించాలని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ డిమాండ్ చేశారు. గరగపర్రు గ్రామంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని కెవిపిఎస్ జిల్లా బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ గరగపర్రులో 2017లో దళితుల సాంఘిక బహిష్కరణ, వెలివేతపై సుదీర్ఘకాలం కెవిపిఎస్, ఇతర దళిత సంఘాల ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు జరిగాయని గుర్తు చేశారు. అంబేద్కర్ విగ్రహాన్ని సెంటర్లో పెట్టడాన్ని నిరసిస్తూ దళితులను సాంఘిక బహిష్కరణ చేస్తే అప్పుడు జరిగిన పోరాటాల ఫలితంగా గ్రామ సెంటర్లో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. విగ్రహ నిర్మాణం జరిగి సుమారు ఐదేళ్లు దాటినా నేటికీ ఆ విగ్రహాన్ని ఆవిష్కరించకపోవడం అన్యాయమన్నారు. గత ప్రభుత్వ హయాంలో శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు కొంత ప్రయత్నం చేశారని, ప్రభుత్వం మారడంతో మళ్లీ విగ్రహావిష్కరణ మరుగున పడిపోయిందన్నారు. జిల్లా అధికారులుగానీ, ప్రజాప్రతినిధులుగానీ ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు చొరవ తీసుకొని అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. గరగపర్రు దళిత బాధితులకు అందాల్సిన నష్ట పరిహారం నేటికీ పూర్తిస్థాయిలో అందకపోవడం అన్యాయమన్నారు. తక్షణం దళితులందరికీ ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టప్రకారం అందాల్సిన నష్ట పరిహారాన్ని పూర్తిస్థాయిలో అందించాలని డిమాండ్ చేశారు. గరగపర్రులో గతంలో దళితుల పట్ల కొనసాగిన కుల వివక్షే ఇప్పుడు అంబేద్కర్ విగ్రహం పట్ల చూపిస్తున్నారని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహానికి అడ్డుగా బస్టాప్ భవనం కట్టడం ఆధిపత్య కుల భావజాలానికి, అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు సానుకూలంగా స్పందించి విగ్రహావిష్కరణ చేసేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం చిన్న నాగేశ్వరరావు, నాయకులు కట్టూరి ప్రసాద్, ఓగిరాల మహేష్, ఎస్.సుబ్బారావు, సిర్రా నవీన్, గోడి చిన్న పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహాన్ని పరిశీలించి మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ రాజగోపాల్

సమాజ అభివృద్ధికి బాలోత్సవం దోహదం

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకునేందుకు ఇదొక మంచి అవకాశం

భీమవరం బాలోత్సవం మూడో పిల్లల సంబరాలు పోస్టర్ ఆవిష్కరణలో ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

సమాజ అభివృద్ధికి బాలోత్సవాలు ఎంతో దోహదపడతాయని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. పిల్లల్లో శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చేందుకు ఇదొక మంచి అవకాశం అని, తల్లిదండ్రులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో భీమవరం బాలోత్సవ కమిటీ సమావేశం అధ్యక్షుడు ఇందుకూరి ప్రసాదరాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన గోపీమూర్తి మూడో పిల్లల సంబరాలు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా భీమవరం బాలోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. పిల్లల్లో శాస్త్రీయ దృక్పథం, అభ్యుదయ భావజాలం, సృజనాత్మకత పెంపొందించడం సమాజ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. డిసెంబర్ 12, 13 తేదీల్లో భీమవరంలోని ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారని తెలిపారు. విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ బాలోత్సవంలో 18 కల్చరల్, 15 అకడమిక్ అంశాల్లో బాలోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ బాలోత్సవాలకు దాతలు, విద్యాసంస్థలు, అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రోత్సాహకులు అందరూ సహకరించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి సిహెచ్.పట్టాభిరామయ్య మాట్లాడుతూ పూర్తి చేసిన అప్లికేషన్లు ఈ నెల 30వ తేదీలోగా శ్రీరామపురంలో ఉన్న కస్తూరిబా గాంధీ భవనంలోగాని, యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలోగానీ అందజేయాలని కోరారు. కార్యక్రమంలో భీమవరం బాలోత్సవం ఉపాధ్యక్షుడు గాతల జేమ్స్, ట్రెజరర్ పి.సీతారామరాజు, కల్చరల్ కమిటీ కన్వీనర్ బి.చైతన్యప్రసాద్, అకడమిక్ కమిటీ కన్వీనర్ పి.శ్రీనివాసరాజు, నేతలు ఎస్.సత్యనారాయణరాజు, జి.రఫాయేలు, కె.పాండురంగరాజు, కె.గోపాలశర్మ, టి.ప్రసాద్, ఎస్.లక్ష్మణ్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరించిన గోపీమూర్తి, నేతలు

అంగన్‌వాడీ కేంద్రాల విలీనం ఆపాలి

అంగన్‌వాడీల నిరసన

ప్రజాశక్తి - వీరవాసరం

తల్లీ బిడ్డ సంరక్షణ కోసం ఏర్పాటైన ఐసిడిఎస్‌ను బలోపేతం చేయాలని, కేంద్రాల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలని, సొంత భవనాలు నిర్మించాలని, ప్రీ స్కూలు నిర్వహణకు ఆరు సంవత్సరాల్లోపు ఉన్న పిల్లలను కేంద్రాలకు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మండల లోని రాయకుదురు, తోలేరు, మత్స్యపురిపాలెం, మత్స్యపురి, నవుదూరు, కొణితివాడ, వీరవాసరం తదితర గ్రామాల్లో శుక్రవారం వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల లబ్ధిదా రులు, గ్రామ పెద్దలు, సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మద్దతు తెలుపుతూ పాల్గొన్నారు.

పెనుగొండ: అంగన్వాడీ కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం ఆపాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన శుక్రవారం లబ్ధిదారులతో కలిసి అంగన్వాడీలు అన్ని గ్రామ సచివాలయాల్లో వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్‌కె.పాదుషా మాట్లాడారు. కేంద్రంలో సాయంత్రం నాలుగు గంటల వరకు ఉండే పిల్లలకు స్నాక్స్, బిస్కెట్లు అందించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీలు కానూరు తులసి, కెయుఎం.భవాని, ఎ.విజయ, ఎన్.కృష్ణవేణి, ఎల్.ఉషశ్రీ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

యలమంచిలి: ప్రభుత్వ పాఠశాలల్లో అంగన్వాడీ కేంద్రాల విలీనాన్ని నిరసిస్తూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని బూరుగుపల్లి, దొడ్డిపట్ల, గుంపర్రు, మట్లపాలెం, యలమంచిలి, చించినాడ, మేడపాడు ఏనుగువానిలంక తదితర గ్రామాల్లో ఆయా పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్, యూనియన్ నాయకులు పద్మశ్రీ, దేవి, రజని, మహాలక్ష్మి, ఇంద్రాణి, దుర్గ, లక్ష్మీ, రమణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



వీరవాసరం మండలంలో..



పెనుగొండ మండలంలో..



యలమంచిలి మండలంలో..

పరిశోధనా సహకారాన్ని విస్తరించాలి

ఎఎన్ఆర్ఎఫ్ ఫెయిర్ పీడీ డాక్టర్ చంద్రశేఖర్‌శర్మ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రభుత్వ సంస్థలతో పరిశోధనా సహకారాన్ని విస్తరించడంతోపాటు పరిశోధనా కార్యకలాపాలను మరింత బలోపేతం చేయాలని ఎఎన్ఆర్ఎఫ్ ఫెయిర్ ప్రాజెక్ట్ డైరెక్టర్, హైదరాబాద్ ఐఐటి ఆచార్యులు డాక్టర్ చంద్రశేఖర్‌శర్మ సూచించారు. ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వి.రమణారావు ఆధ్వర్యంలో ఎఎన్ఆర్ఎఫ్ ఫెయిర్ ప్రథమ్ ప్రాజెక్ట్ సమావేశాన్ని నిట్ పరిపాలనా భవనంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ చంద్రశేఖర్‌శర్మ మాట్లాడుతూ ఫెయిర్ ప్రాజెక్టు ద్వారా లభ్యమయ్యే పరిశోధనా అవకాశాలు, సాంకేతిక నైపుణ్య కార్యక్రమాలు, భవిష్యత్తు ప్రణాళిక, పరిశోధనలకు సంబంధించిన సహకారం వంటి అంశాలు వివరించారు. ఎపి నిట్‌లోని ఏడుగురు ఆచార్యులు, 11 మంది విద్యార్థులకు హైదరాబాదులోని ఐఐటిలో రెండు నెలలపాటు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని చెప్పారు. ఈ శిక్షణలో ప్రాజెక్టు డిజైన్, ప్రయోగాత్మక పరిశోధనా పద్ధతులు, డేటా విశ్లేషణ, అధునాతన సాంకేతిక నైపుణ్యాల గురించి బోధిస్తారన్నారు. విద్యార్థుల్లో పరిశోధనాపరమైన ఆసక్తిని రేకెత్తించడానికి, ఆచార్యులకు కొత్త పరిశోధనా అవకాశాలను పెంపొందించుకోవడానికి ఇటువంటి శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. విద్యాసంస్థల పురోగతికి భారత ప్రభుత్వ ఆధీనంలోని మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఎఎన్ఆర్ఎఫ్ ప్రాజెక్టు నిమిత్తం రూ.2.6 కోట్ల నిధులను మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ, ఎఎన్ఆర్ఎఫ్ ఫెయిర్ ప్రాజెక్ట్ ఎపి నిట్ కార్యనిర్వహణాధికారి డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి చంద్రశేఖర్‌శర్మను జ్ఞాపిక, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ కార్తీక్ శేషాద్రి, వినోద్‌కుమార్ రాజాతోపాటు డీన్‌లు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ వీరేశ్ కుమార్, ఆచార్యులు డాక్టర్ పి.శంకర్, డాక్టర్ శ్రీ ఫణికృష్ణ కర్రి, డాక్టర్ కిరణ్ తీపర్తి, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ నగేష్ భట్టు, డాక్టర్ రాముడు, డాక్టర్ రఫీ మహమ్మద్, డాక్టర్ నరసింహారావు, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ కృష్ణ చైతన్య, డాక్టర్ శ్రీనివాసన్, డాక్టర్ సుదర్శన దీప, డాక్టర్ శ్రీలత పాల్గొన్నారు.



చంద్రశేఖర్‌శర్మను సత్కరిస్తున్న ప్రముఖులు

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం


జిల్లాలో పెద్దఎత్తున వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రతినెలా మూడో శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత, సమాజ పరిశుభ్రత అనే థీమ్‌ను ప్రకటించారన్నారు. దీన్ని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లో జెసి జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. పరిశుభ్రత, ప్రజా పరిశుభ్రత కార్యక్రమాలలో ప్రజలను విధిగా భాగస్వామ్యులను చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒలు దాసి రాజు, ఖతీబ్ కౌసర్‌భానో, సిపిఒ కె.శ్రీనివాసరావు, డిపిఒ ఎం.రామనాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, సహాయ కమిషనర్ ఎ.రాంబాబు, డిఎంహెచ్ఒ గీతాభాయి, డిఇఒ ఇ.నారాయణ, డ్వామా పీడీ కెసిహెచ్.అప్పారావు, పంచాయతీరాజ్ ఎస్ఇ శ్రీనివాసరావు, జిల్లా పర్యాటకశాఖాధికారి ఎ.అప్పారావు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లను గుర్తించాలి

డిపిఒ ఎం.రామనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - మొగల్తూరు

అనధికార లేఅవుట్లను గుర్తించి రెగ్యులరైజేషన్ చేసేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం.రామనాథ్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం మొగల్తూరు, నరసాపురం మండలాల పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. లేఅవుట్ల అనుమతుల కోసం ఏలూరులో ఉన్న ఇడా అప్రూవల్ పొందాలన్నారు. పాత లేఅవుట్ల అనుమతుల కోసం ఎల్ఎస్ఆర్ స్కీములో రెగ్యులరైజేషన్ చేయించుకోవచ్చని సూచించారు. అనుమతులు ఉన్న లేఅవుట్లకు వీధి దీపాలు, రోడ్లు, విద్యుత్, డ్రెయినేజీ తదితర మౌలిక సదుపాయాలు పంచాయతీ ద్వారా ఏర్పాటు చేసేందుకు వీలుంటుందన్నారు. అనుమతులు లేని లేఅవుట్ యజమానులు అందరూ వచ్చే జనవరి 26లోగా ఎల్ఎస్ఆర్ స్కీములో రెగ్యులైజేషన్ చేయించుకునేలా కార్యదర్శులు చర్యలు చేపట్టాలన్నారు. అనుమతులు లేని లేఅవుట్లలో నోటీసు బోర్డులను ఏర్పాటు చేసి సరిహద్దు రాళ్లను తొలగించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణా లోపాలు లేకుండా కార్యదర్శులు విధులు నిర్వహించాలన్నారు. ఆయన వెంట డిఎల్‌పిఒ జ్యోతిర్మయి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



మాట్లాడుతున్న డిపిఒ రామనాథ్‌రెడ్డి

సుధారాణి, రాజుపై సస్పెన్షన్ వేటు

ఉండి: ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారనే అభియోగంతో ఉండి సబ్ రిజిస్ట్రార్ ఎంవి.సుధారాణి, సీనియర్ అసిస్టెంట్ పి.శరాబంధు రాజులను జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాస్ సస్పెండ్ చేశారు. దీనిపై ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ వీరవల్లి సురేష్‌ను వివరణ కోరగా సుధారాణి, రాజులను సస్పెండ్ చేస్తూ జిల్లా రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఈ సందర్భంగా బాధితులైన కురెళ్ల రాజకుమార్, ఏలూరి రంగబాబు, క్రొవ్విడి శ్రీనివాస్ మాట్లాడుతూ తమ భూములను తమ అంగీకారం లేకుండా వేరే వారికి అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించిన సుధారాణి, శరాబంధు రాజులను సస్పెండ్ చేయడం శుభ పరిణామమన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసి తమకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని వారు కోరారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

ప్రజాశక్తి - పెనుమంట్ర

పొలమూరు గ్రామంలోని శెట్టిబలిజపేటలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఐద్వా ఆధ్వర్యంలో శుక్రవారం బాలలకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని బాలికలకు గుడ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కలిగించారు. స్కూల్ విద్యా కమిటీ ఛైర్మన్ వల్లెం హేమలత, ఐద్వా ప్రతినిధులు కేతా పద్మజ, కట్టా దుర్గ, వనం లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఐద్వా నేతలు

యాప్‌లో ఫొటోలు ఆలస్యం

130 మంది అంగన్వాడీలకు మెమోలు

పెనుమంట్ర: అంగన్వాడీ కేంద్రాలను శుక్రవారం ఉదయం తెరిచిన ఫొటోలు యాప్‌లో ఆలస్యంగా అప్‌లోడ్ చేశారనే కారణంగా పెనుమంట్ర సిడిపిఒ ప్రాజెక్టు పరిధిలోని 130 మంది అంగన్‌వాడీలకు మెమోలు జారీ చేశారు. ఆ మెమోలను శుక్రవారం రాత్రిలోపు తీసుకోవాలని ఆదేశించడంతో అంగన్వాడీలంతా శుక్రవారం సాయంత్రం నానావస్థలు పడుతూ సిడిపిఒ కార్యాలయానికి చేరుకున్నారు. ఆ మెమోలు తీసుకుని, సంబంధిత సంతకాలు పెట్టాక ఇళ్లకు వెళ్లేందుకు బస్సులు, ఆటోలు లేక రాత్రి ఎనిమిది గంటలకు సైతం ఆ ప్రాంతంలోనే రోడ్లపై అంగన్వాడీ కార్యకర్తలు పడిగాపులు పడాల్సి వచ్చింది. ఈ విషయం తెలుసుకుని సిఐటియు నేత కూసంపూడి సుబ్బరాజు అక్కడికి చేరుకుని చేరుకుని అధికారుల తీరుపై నిరసన తెలిపారు. ఫొటోలు అప్‌లోడ్‌లో కొన్ని నిమిషాలు ఆలస్యమైందనే పేరుతో మెమోలు ఇవ్వడం సరికాదని, అంగన్వాడీలు రాత్రి వేళ ఇళ్లకు ఎలా వెళ్తారని, మార్గమధ్యంలో ఏమైనా జరిగితే ఐసిడిఎస్ అధికారులు బాధ్యత వహిస్తారా అని ప్రశ్నించారు.

స్కూల్ విద్యార్థుల ఆటో బోల్తా

ప్రజాశక్తి - తణుకు

తణుకు మండలం దువ్వ గ్రామంలో అను పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులను తరలిస్తున్న ఆటో శుక్రవారం ప్రమాదవశాత్తు బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు విద్యార్థులు గాయపడ్డారు. వారిలో ఇద్దరిని తణుకు పట్టణంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారిలో చదలవాడ కీర్తి, చదలవాడ అభి ఉన్నారు. ఉదయం గ్రామంలో పలు ప్రాంతాల్లో 12 మంది విద్యార్థులను ఎక్కించుకుని ఆటో స్కూల్‌కు బయలుదేరింది. శివాలయం వద్దకు వచ్చేసరికి ఎదురుగా మోటారు సైకిల్‌ను తప్పించే క్రమంలో ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ సమయంలో ఆటో డ్రైవర్ ఫోన్ మాట్లాడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. స్థానికులు అప్రమత్తమై ఆటోలో విద్యార్థులను బయటకు తీశారు. ఇదే సమయంలో స్థానికులు 108 వాహనానికి ఫోన్ చేయడంతో ఘటనా స్థలానికి చేరుకున్న వాహనాన్ని స్కూల్ యాజమాన్యం వెనక్కు పంపించేసి, ప్రమాద విషయాన్ని గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నించారు. అయితే సమాచారం తెలుసుకున్న తణుకు రూరల్ పోలీసులు, తణుకు ఎంవిఐ విద్యార్థులు చికిత్స పొందుతున్న ఆసుపత్రికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తణుకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

ఆక్రమణలు గుర్తించండి

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో చెరువు, కాలువ పోరంబోకు స్థలాల్లో ఆక్రమణలు గుర్తించి వాటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ ఎంవి.రామాంజనేయులు అధికారులకు సూచించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులతో వాచ్‌డాగ్ కమిటీ సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఆక్రమణలపై చర్యలు తీసుకునే క్రమంలో వారికి నోటీసులు ఇవ్వాలన్నారు. ఆక్రమణల స్వభావాన్ని బట్టి చర్యలు త్వరతగతిన తీసుకోవాలన్నారు. అభ్యంతరంలేని ఆక్రమణలు తక్షణం తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎఇ వెంకటేశ్వరరావు, వేంద్ర రమణ, పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

టిడిపి భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అధ్యక్షతన స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నియోజకవర్గ టిడిపి కమిటీల ప్రమాణ స్వీకారోత్సవ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గంలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకూ ప్రభుత్వ నామినేటెడ్ పదవులు కేటాయించడం జరుగుతుందని, పదవులు రానివారు నిరాశ చెందకుండా పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని తెలిపారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, మహిళా ఆర్థిక ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీతల సుజాత మాట్లాడుతూ పార్టీ పట్ల విధేయతతో కష్టించి పనిచేసే వారందరికీ పదవులు లభిస్తాయన్నారు. పార్టీ ఆమోదించిన వీరవాసరం, భీమవరం మండలాలు, భీమవరం పట్టణ నాయకులు గ్రామ, వార్డు కమిటీల నాయకులు, బూత్, యూనిట్, క్లస్టర్ కన్వీనర్లు, కో-కన్వీనర్లచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు, వెంద్ర శ్రీనివాస్, ఎఎంసి చైర్మన్ కలిదిండి సుజాత రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయం అనాథాశ్రమం ప్రారంభం

పెనుగొండ: ప్రశాంతి నిలయం వృద్ధుల అనాథాశ్రమం పెనుగొండ కరెంట్ ఆఫీసు దగ్గరలోని దంపనబోయిన పాపారావు రోటరీ ఛారిటబుల్ ట్రస్ట్ పెనుగొండలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సభకు ఆంధ్రోపన్యాసకులు ఆస్కా చైర్మన్ డాక్టర్ బాలచందర్ సాదే అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన నూలి అనుపమ మాట్లాడుతూ తల్లిదండ్రులు చనిపోయిన అనాథ పిల్లలకు, వృద్ధులకు ఉచిత భోజన, వసతి ఆరోగ్య సంరక్షణ తదితర సదుపాయాలతో ఈ అనాథ వృద్ధాశ్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆశ్రమం గౌరవాధ్యక్షులు బివి రమణ మాట్లాడుతూ తన గురువు రిటైర్డ్ ప్రిన్సిపల్ డిసిహెచ్ హనుమంతరావు సహకారంతో ఆశ్రమం నెలకొల్పినట్లు తెలిపారు. డాక్టర్ బి.సూర్యనారాయణ రాజు, బంగారమ్మ, నూలి వెంకటరమణ మూర్తి, గాజుల చిన పుల్లారావు సహకారం అందిస్తామని చెప్పారు ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు, స్థలదాత కీ.శే దంపనబోయిన పాపారావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు 20 గ్రాముల బంగారం విరాళం

భీమవరం టౌన్: భీమవరం మావుళ్లమ్మ అమ్మవారికి దాతలు 20 గ్రాముల బంగారాన్ని విరాళంగా అందించారు. శుక్రవారం మొగల్తూరు మండలం జగన్నాథపురం ఎంపిటిసి మంతెన పాండు రంగరాజు, సాయి మౌనిక దంపతులు, వారి కుటుంబ సభ్యులు 20 గ్రాముల బంగారాన్ని ఎంఎల్ఎ రామాంజనేయులు చేతుల మీదుగా శుక్రవారం ఆలయ ఇఒ బుద్ధ మహాలక్ష్మి నగేష్‌కు అందజేశారు. మావుళ్లమ్మ అమ్మవారికి స్వర్ణ వస్త్రానికి దాతలు, యాత్రికులు ఎంతో సహకారం అందిస్తున్నారని, త్వరలోనే అమ్మవారి స్వర్ణ వస్త్రం పూర్తి చేస్తామని తెలిపారు. విరాళం అందించిన దాతలను ఎంఎల్ఎ అభినందించారు.

కొత్త రోడ్ల పరిశీలన

ఉండి: సుమారు తొమ్మిది లక్షల రూపాయల గ్రామపంచాయతీ నిధులతో నిర్మించిన రోడ్లను ఉండి ఒకటో వార్డు సభ్యులు రెడ్డి లావణ్య దుర్గారావు, రెండో వార్డు సభ్యులు జామి జ్యోతి వెంకటరావు, నాలుగో వార్డు సభ్యులు చెన్నంశెట్టి హరినాయుడు, 9వ వార్డు సభ్యులు అడబాల వరప్రసాద్ (నాని) పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకటో వార్డులో కాలువగట్టు వైపు రోడ్డు పూర్తిగా పాడైపోవడంతో సుమారు మూడు లక్షల రూపాయల వ్యయంతో జీఎస్‌పి రహదారి నిర్మించడం జరిగిందన్నారు. అదే విధంగా రెండో వార్డులో ఎన్ఆర్‌పి అగ్రహారం సమీపంలోని కాలువ వైపు రహదారి 6 లక్షల రూపాయలతో నిర్మించడం జరిగిందన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన అన్నదానం

ఉండి: కాలి నడకన చిన్న తిరుపతికి వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ చేసినట్టు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ గాదిరాజు రంగరాజు తెలిపారు. ఉండి సంత్ నిరంకారి బాబా ఆశ్రమం సమీపంలో క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. యాత్రికులకు చక్కెర పొంగలి, పులిహోర, మజ్జిగ, లస్సీ, తాగునీరు పంపిణీ చేశారు. దాత రుద్రరాజు నరసరాజు మాట్లాడుతూ కార్తీకమాసం సందర్భంగా ద్వారకాతిరుమల వెళ్లే వారికి ఈ కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేగేశ్న అనంతలక్ష్మి, కాగిత మహంకాళి, బుద్ధరాజు సుబ్బరాజు, కార్యదర్శి పెన్మెత్స రంగప్రసాదరాజు, శివరామరాజు, భూపతిరాజు హరనాథ రాజు పాల్గొన్నారు.

'విప్లవ నాయకి' గ్రంథావిష్కరణ

ఆచంట: ఆచంటకు చెందిన వైసిపి సీనియర్ నేత వైట్ల కిషోర్ కుమార్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కిషోర్ కుమార్ రచించిన తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జె.జయలలిత బయోగ్రఫీ 'విప్లవ నాయకి' గ్రంథాన్ని జగన్మోహన్ రెడ్డి చేతులమీదుగా ఆవిష్కరించారు. అనంతరం వైట్ల కిషోర్‌ను జగన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం మాజీ ఎంఎల్ఎ పేర్ని నాని, మడిమెట్ల నరేష్, డి.ప్రశాంత్ కుమార్, అరిగెల సురేష్ బాబు పాల్గొన్నారు.

విద్యార్థులు సొసైటీకి సేవలందించాలి

భీమవరం టౌన్: విద్యార్థులు చదువుతో పాటు తమ విజ్ఞానంతో గ్రామీణ ప్రజలను చైతన్యవంతులను చేసేలా సొసైటీకి సేవలందించాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ జిల్లా ఇన్‌ఛార్జి రోహిత్ విద్యానంద్ పేర్కొన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర క్యాంపెయిన్ ఓరియంటేషన్ ప్రోగ్రాం శుక్రవారం సివిల్ సెమినార్ హాల్లో నిర్వహించారు. కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆర్.కృష్ణ చైతన్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రోహిత్ విద్యానంద మాట్లాడుతూ ప్రపంచంలో భారతదేశం అన్ని రంగాల్లో విజయాలు అందుకుంటున్నప్పటికీ పరిసరాల పరిశుభ్రత విషయంలో వెనకబడి ఉన్నామని దీన్ని ప్రతి విద్యార్థి గమనించాలని సూచించారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బివిహెచ్ ఎస్.రామకృష్ణంరాజు మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సహాయ కోఆర్డినేటర్ కెఎస్‌వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సహకార వారోత్సవాలు ప్రారంభం

పాలకొల్లు రూరల్: రైతులకు సహకార సంఘం ద్వారా అందిస్తున్న ప్రయోజనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తిల్లపూడి పిఎసిసి సొసైటీ అధ్యక్షులు కామిశెట్టి రంగారావు చెప్పారు. సహకార సంఘం వారోత్సవాల ప్రారంభం సందర్భంగా శుక్రవారం సొసైటీ ఆవరణలో సహకార జెండాను ఆయన ఆవిష్కరించారు. సహకార సంఘాల పటిష్ఠత గురించి ఆయన మాట్లాడారు. ఇంకా త్రిసభ్య కమిటీ సభ్యులు దిద్దె నందిపు, బొల్లపల్లి రంగారావు, కార్యదర్శి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సహకార వారోత్సవాలు ప్రారంభించిన సొసైటీ అధ్యక్షులు రంగారావు

పోడూరు : సహకార సంఘం ద్వారా అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కో ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. జిన్నూరు సొసైటీ వద్ద శుక్రవారం అఖిలభారత సహకార సంఘం వారోత్సవాలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా సొసైటీ చైర్మన్ దేవళ్ల ప్రసాద్ జాతీయ పతాకాన్ని, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు సహకార సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతు అభివృద్ధికి సహకార సంఘాలు వెన్నెముకలాంటివన్నారు. సొసైటీ చైర్మన్ దేవళ్ల ప్రసాద్ మాట్లాడుతూ జిన్నూరు సొసైటీని మరింత అభివృద్ధిలో తీసుకొస్తామన్నారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి.విజయశ్రీ, జిన్నూరు, మట్టపర్రు గ్రామ సర్పంచులు జమ్ము బేబీ మహాలక్ష్మి, దొమ్మేటి శ్రీనివాస్, పాలకొల్లు ఎఎంసి వైస్ చైర్మన్ దాసరి రత్నం రాజు పాల్గొన్నారు.

పుంత రోడ్లపై ప్రతిపాదనలు

నరసాపురం: మార్కెట్ యార్డ్ ద్వారా గ్రామాల్లో వేయాల్సిన పుంత రహదార్లపై ప్రతిపాదనలు అందించాలని కమిటీ తీర్మానించింది. శుక్రవారం ఎఎంసి కార్యాలయంలో చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షులు దేశెట్టి గంగాధర్, పాలకవర్గ సభ్యులు సమావేశాన్ని నిర్వహించారు. మార్కెట్ కమిటీ పరిధిలో శిస్తు, ఖర్చులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఎఎంసి సునీల్ కుమార్, కార్యదర్శి కె శ్రీనివాస్ పాల్గొన్నారు.

నరసాపురంలో గ్రీవెన్స్

నరసాపురం: పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) ఏర్పాటు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలను మైనార్టీ అఫైర్స్ అడ్వైజర్ ఎంఎ షరీఫ్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు వినతి అర్జీలు స్వీకరించారు. షరీఫ్, రామరాజు మాట్లాడుతూ సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా ఈ వేదిక ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఎఎంసి చైర్మన్ శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి చర్యలు

మొగల్తూరు: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, పంచాయతీ అభివృద్ధికి సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం.రామనాథరెడ్డి అన్నారు. ముత్యాలపల్లి గ్రామాన్ని శుక్రవారం రామనాథ్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. శానిటేషన్, ఎస్‌డబ్ల్యుపిసి షెడ్డు వర్మి తయారీ విధానము, సిపిడబ్ల్యు స్కీం ద్వారా ప్రజలకు అందుతున్న శుద్ధి జలాలు, స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో ప్రజల ఆస్తుల వివరాలను నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచి శ్రీ అద్దాల గోపాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఎం.సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది, పలువురు గ్రామస్తులు ఉన్నారు.

విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - ఆచంట

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని ఎస్ఎంసి చైర్మన్ బండి అనంతలక్ష్మి అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా ఆచంట పంచాయతీ పరిధి కానుపోతుగుంట మండల ప్రజా పరిషత్ పాఠశాలలో బాలల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ముందుగా మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సిఐటియు మండల కన్వీనర్ బండి రంగారావు మాట్లాడుతూ చదువుతోపాటు చిత్రలేఖనంతో పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.

పెనుమంట్ర : పిల్లలు అందరికీ అభిమాన మేనమామ మన తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రు అని ఎంఇఒ-2 ఉంగరాల నాగేశ్వరరావు అన్నారు. ఆర్‌ఎజెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బాలల దినోత్సవం జరిగింది. నెహ్రూ విగ్రహానికి ఎంఇఒ, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పిల్లలకు, ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పొలమూరు హైస్కూల్లో హెచ్‌ఎం బిడి సరస్వతి ఆధ్వర్యంలో బాలల దినోత్సవం జరిగింది. పెనుమంట్ర మార్టేరు శాఖా గ్రంథాలయాల్లో గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రామ సర్పంచి తాడిపర్తి ప్రియాంక, ఉప సర్పంచి భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

భీమవరం : పెన్నాడలోని బైట్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నందమూరిగరువు ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అకడమిక్ డీన్ కురెళ్ల భాస్కరరావు మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, పరుగు పందెం, మ్యూజికల్ ఛైర్స్, లెమన్ అండ్ స్పూన్ పోటీలు నిర్వహించారు. విజేతలకు కురెళ్ల భాస్కరరావు, ప్రధానోపాధ్యాయిని భారతి బహుమతులు అందజేశారు. కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎబిఎస్ఆర్ మనోహర్, ఉపాధ్యాయులు జి.రామకృష్ణ, వాలంటీర్లు పాల్గొన్నారు.

పాలకోడేరు : గొల్లలకోడేరు గ్రంథాలయంలో 58వ గ్రంథాలయ వారోత్సవాలను ఉపసర్పంచి కలిగింది శ్రీనివాస్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా నెహ్రూ జయంతి బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ జ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూపతి రాజు పృధ్విరాజు, బివి.పాల్, గ్రంథాలయ అధికారి జి.బాలరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



కాళ్ల : విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్ అందజేస్తున్న దృశ్యం

ఉండి : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాములపర్రు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు కడగల యువ సాయిరాం, శేషపు మణికంఠ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య అభివృద్ధికి దాతల సహకారం ఎంతైనా అవసరం ఉందన్నారు. ప్రభుత్వం విద్య వ్యవస్థకు పెద్దపీట వేసిందన్నారు. అనంతరం విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలు, పెన్నులు, జామెట్రీ బాక్స్ తదితర విద్యాసామగ్రి అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని పెన్మత్స అరుణ కుమారి, ఉపాధ్యాయులు గుబ్బల తేజ వెంకట దినేష్ కుమార్, సభ్యులు కొత్తపల్లి ప్రసాద్, మహమ్మద్ రఫీ, కె.భవానీశంకర్ పాల్గొన్నారు.

పాలకొల్లు : పట్టణంలోని జివిఎస్‌విఆర్ మున్సిపల్ మోడల్ ప్రయిమరీ స్కూల్లో హెచ్‌ఎం రాయపూడి భవానీ ప్రసాద్ అధ్యక్షతన బాలల దినోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా సంగినీడి వెంకట రంగారావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ పిల్లలే దేశానికి నిజమైన బలం అన్నారు. అనంతరం నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు, మధుసూదన్ రెడ్డి, రోజా, లీలా కుమారి తదితరులు పాల్గొన్నారు.

కాళ్ల : విద్యార్థులకు ఉత్తమ విద్యనందించాలని రిటైర్డ్ ఉపాధ్యాయిని విజయలక్ష్మి అన్నారు. సత్యనారాయణపురం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వీరమల్లు జనార్ధన్‌రావు ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గతంలో కాళ్ల మండలంలో ఉపాధ్యాయురాలిగా పనిచేసి భీమవరం మండలంలో వాలంటరీగా రిటైర్డ్ అయిన విజయలక్ష్మి -మాధవరావు లుసత్యనారాయణ పాఠశాల విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్, స్వీట్స్, చాక్లెట్స్ అందజేశారు.

పిల్లలు నెహ్రూను ఆదర్శంగా తీసుకుని మంచి పౌరులుగా ఎదగాలని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. లక్ష్మీ నరసింహపురం హైస్కూల్లో బాలల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆట పోటీలు నిర్వహించారు. బహుమతులు అందజేశారు.

మొగల్తూరు : మండలంలోని గ్రామాలలో నెహ్రు జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవాన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఆయా పాఠశాలల నిర్వాహకులు క్రీడా పోటీలు నిర్వహించారు. బహుమతులు అందించారు.

తణుకు: విద్యార్థులు భావితర పౌరులుగా ఎదగాలని వివేకానంద గ్లోబల్ స్కూల్ కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, స్కూల్ సెక్రటరీ రీనాసాయి అన్నారు. వివేకానంద గ్లోబల్ స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆటల పోటీలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులను ఉత్సాహపరిచే విధంగా పాఠశాల యాజమాన్యం వారు రకరకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. స్కూల్ ప్రిన్సిపల్ రవీంద్రనాధ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏ సమస్య వచ్చినా మండల న్యాయ సేవల కమిటీ తణుకును సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందొచ్చని రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణవేణి అన్నారు. శుక్రవారం స్థానిక 13వ వార్డు ఎస్‌సి బాలికల హాస్టల్లో జడ్జి సత్యవతి ఆదేశాల మేరకు బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడారు. న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, పోణంగి శ్రావణిసమీర, అజయకుమార్, ఎస్‌కె మోతీ పాల్గొన్నారు.

ఉండి: జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలను కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాందువ్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు దాగారపు గోపాలం అధ్యక్షతన నెహ్రూ చిత్రపటానికి కెవిపిఎస్ నాయకులు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాదాసి గోపి మాట్లాడారు. అనంతరం హెచ్‌ఎం దాగారపు గోపాలం సౌజన్యంతో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ రాజేశ్వరి, అంగన్వాడీ టీచర్ సత్యవేణి, హెల్పర్ సుప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞాన భాండాగారాలు గ్రంథాలయాలు

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - మొగల్తూరు

గ్రంథాలయాల ద్వారా జ్ఞాన సముపార్జన లభిస్తుందని విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. మొగల్తూరులోని చిరంజీవి గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను సర్పంచి పడవల మేరీ సత్యనారాయణతో కలిసి నాయకర్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిత్యం పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ నిప్పులేటి తారక రామారావు, ఉప సర్పంచి బోనం నరసింహారావు, గ్రంథాలయ పాలకులు బత్తుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పోడూరు : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని పాలకొల్లు ఎఎంసి వైస్ ఛైర్మన్ దాసరి రత్నంరాజు అన్నారు. జిన్నూరులోని శ్రీసీతారామరాజు విజ్ఞాన ప్రభ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా గ్రామ సర్పంచి జమ్ము బేబీ మహాలక్ష్మి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సాయంత్రం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. సొసైటీ ఛైర్మన్ దేవళ్ల ప్రసాద్, పాలకొల్లు వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ ఛైర్మన్ దేవళ్ల శ్రీరామకోటి మోహన్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు బూడి కృష్ణ, కార్యదర్శి టి.వెంకటేశ్వరరావు, పాలవలస తులసీరావు పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చినఅమిరంలో గ్రంథాలయ వారోత్సవాలను పలు రకాల పుస్తకాల సేకరణతో పాఠశాల హెచ్‌ఎం వేగేశ్న అనూరాధ ప్రారంభించారు. పాఠశాల గ్రంథాలయ రీడర్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో పుస్తక సేకరణ, పుస్తక ప్రదర్శన, పుస్తక సమీక్ష వకృత్వ, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ నిర్వాహకులు సిహెచ్.ప్రసాదరావు తెలిపారు. 20న బహుమతి ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. తారకేశ్వరి, బి.రామకృష్ణ, పి.ప్రసాద్, డి.బాపిరాజు, టి.అప్పన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నరసాపురం: వైఎన్ కళాశాల గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ కెఎస్‌వి.రంగారావు వారోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. గ్రంథాలయం మనకు విజ్ఞానాన్ని అందించే ప్రదేశమన్నారు. జివిఆర్ బిఇడి కళాశాల ప్రిన్సిపల్ పి.శాంతి, కళాశాల డీన్ గంధం శ్రీరామ కృష్ణ మాట్లాడారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ బెజవాడ వెంకటరత్నం, సంస్కృత విభాగాధిపతి కె.వరలక్ష్మి, కామర్స్ స్వామి, ఫిజిక్స్ ప్రవీణ్, లైబ్రేరియన్ కోటయ్య, విజయలక్ష్మి, వరలక్ష్మి, సుబ్రహ్మణ్యం, అబ్దుల్లా పాల్గొన్నారు.

గణపవరం: గ్రంథాలయ వారోత్సవాలను స్థానిక గ్రంథాలయం వద్ద యుటిఎఫ్ మండల నాయుకులు, ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరుగు మ్యూజికల్ ఛైర్ వంటి ఆటల పోటీలు నిర్వహించారు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

పాలకొల్లు : శ్రీ ఆద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల పాలకొల్లులో గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే గ్రంథాలయ వారోత్సవాలను కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా రంగనాథన్ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రిన్సిపల్ రాజరాజేశ్వరి, వైస్ ప్రిన్సిపల్ కృష్ణ, కళాశాల ఐక్యూఏసి కోఆర్డినేటర్ కె.భద్రాచలం, కళాశాల తెలుగు విభాగాధిపతి వెంకట స్వామి మాట్లాడారు. గ్రంథ పాలకులు వివిసిహెచ్.రమేష్, రసాయన శాస్త్ర అధ్యాపకులు ఎ.వంశీ, చరిత్ర అధ్యాపకులు పాల్గొన్నారు.

నరసాపురం : పట్టణంలో ఘనంగా నిర్వహించిన గ్రంథాలయ దినోత్సవ వారోత్సవాలు విశేష ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. గ్రంథాలయాలు సమాజ అభివృద్ధికి మార్గదర్శకమైన జ్ఞాన కేంద్రాలు అని పేర్కొన్నారు. ఆయన పిల్లలతో కాసేపు పార్కులో గడిపారు. లైబ్రేరియన్ కెజెఎస్ఎల్ కుమారి, కమిషనర్ ఎం.అంజయ్య, శిరిగినీడి రాజ్యలక్ష్మి, ఎంఇఒ పుష్పరాజ్యం పాల్గొన్నారు.

ఆకివీడు : విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని ఆర్థిక శాస్త్ర అధ్యాపకులు కె.ఆనంద్ కుమార్ తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాలను మండలంలోని దుంపగడపలో వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. అనంతరం గ్రంథాలయ అధికారి ఫణి రాజు మాట్లాడారు.

రక్త దాతలే ప్రాణదాతలు : నాగేంద్రప్రసాద్

భీమవరం: రక్తదాతలే ప్రాణదాతలు అని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగేంద్రప్రసాద్ అన్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాల మేరకు యూనియన్ బ్యాంకు లీడ్ బ్యాంకు డిపార్డుమెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తంగా భీమవరం, తణుకు రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకుల్లో బ్యాంకు సిబ్బంది రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగేంద్రప్రసాద్ ప్రారంభించారు. యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా, స్టేట్ బ్యాంకు, కెనరా బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ ప్రగతి గ్రామీణ, ఇండియన్ బ్యాంకు సిబ్బంది రక్తదానం చేశారు. 16 యూనిట్లు రక్తాన్ని సేకరించి భీమవరం, తణుకు రెడ్‌క్రాస్ సెంటర్లకు అందజేశారు. ఈ సందర్భంగా లీడ్‌బ్యాంకు మేనేజర్ నాగేంద్ర ప్రసాద్ రక్తదానం చేసిన సిబ్బందిని అభినందించారు. ఈ స్ఫూర్తితో మిగిలిన వారు కూడా రక్తదానం చేయాలని కోరారు. అనంతరం రక్తదానం చేసిన సిబ్బందికి గుర్తింపు ధ్రువపత్రాలను నాగేంద్ర ప్రసాద్ అందజేశారు. యూనియన్ బ్యాంకు భీమవరం డిప్యూటీ రీజనల్ హెడ్ వెంకన్నబాబు, స్టేట్‌బ్యాంకు రీజనల్ అధికారి మెహర్‌బాబా, కెనరా బ్యాంకు డిజిఎం మాధవ్, ఎపి ప్రగతి కోఆర్డినేటర్ భీమవరం బ్యాంకు సిబ్బంది, ఐఆర్‌సిఎస్ ఛైర్మన్ ఎంఎస్‌విఎస్.బద్రిరాజు, సీనియర్ కోఆర్డినేటర్ ఎస్.మల్లేశ్వరరావు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న లీడ్ బ్యాంకు మేనేజర్ నాగేంద్రప్రసాద్

గ్రూపు దేవస్థానాల ఛైర్మన్ల ప్రమాణస్వీకారం

వీరవాసరం: దేవాలయాల పవిత్రకు భంగం కలగకుండా దేవస్థానాల కమిటీలు పని చేయాలని భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామంజనేయులు (అంజిబాబు) అన్నారు. వీరవాసరం గ్రూపు దేవస్థానాలైన కనకదుర్గమ్మ, వీరేశ్వర విశ్వేశ్వర, వేణుగోపాల, సీతారామస్వామి దేవస్థానాల కమిటీల ప్రమాణస్వీకారోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కనకదుర్గమ్మ దేవస్థానానికి మేడిశెట్టి కృష్ణారావు, సీతారామ దేవస్థానానికి కుక్కలసత్యనారాయణ, వీరేశ్వర విశ్వేశ్వర దేవస్థానానికి మద్దాల రాంబాబులు ఛైర్మన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తోట సీతారామలక్ష్మి, కొటికలపూడి గోవిందరావు, పీతల సుజాత, కలిదిండి సుజాత,టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న కనకదుర్గమ్మ దేవస్థానం కమిటీ సభ్యులు

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రపంచ మధుమేహ దినోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి - గణపవరం

ప్రపంచ మధుమేహం దినోత్సవం సందర్భంగా శుక్రవారం పిప్పర ఆరోగ్య కేంద్రం వద్ద షుగర్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీదివ్య మాట్లాడుతూ మధుమేహం రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. ప్రతి రోజూ వ్యాయామం చేయడం వల్ల డయాబెటిక్ నివారించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరం : పిఎంపి అసోషియేషన్ ఆధ్వర్యంలో కాశిపాడులో ప్రపంచ మధుమేహం దినోత్సవం నేపథ్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచి తెర్లి నాగరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు ఎఆర్‌కె పరమేశ్వర్లు మాట్లాడుతూ షుగర్ నివారణకు మందులు తప్పనిసరిగా వాడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జాషువా, ఎంపిటిసి జంపన పద్మావతి రమేష్‌రాజు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, ఎఎన్‌ఎం ఏసమ్మ పాల్గొన్నారు.

భీమవరం : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మధుమేహ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. మధుమేహం ముప్పు అందరికీ ఉందని చెప్పు అనే నినాదంతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక డిఎంహెచ్ఒ కార్యాలయ సిబ్బందికి పరీక్షలు షుగర్, బిపి, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. అడిషనల్ డిఎంహెచ్ఒ రవి బాబు, డిఐఒ డి.సుధాలక్ష్మి, ఎఒ భావన, పిఒ ఎన్‌సిడి కెఎంఆర్ కిషోర్, డిఎంఒ క్రాంతి పాల్గొన్నారు.



పాలకొల్లు : డాక్టర్ సంతోష్ కుమార్‌ను సత్కరిస్తున్న యుకెసి సభ్యులు

మొగల్తూరు : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ఉద్దేశంతో షుగర్ నిర్ధారణ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశామని లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు యు.గీతా షారన్ పుష్ప అన్నారు. స్థానిక పాతకాలవ సెంటర్లో క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన షుగర్ క్యాంపును ఆమె ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో పలువురికి పరీక్షలు నిర్వహించారు. క్లబ్ కార్యదర్శి తణుకుల రామకృష్ణ, ట్రెజరర్ గుమ్మళ్ల రవికుమార్, క్లబ్ ఫాస్ట్ ప్రెసిడెంట్, వైద్యులు సిహెచ్ శ్రీనివాస్‌రాజు, యు.రాంబాబు పాల్గొన్నారు.

నరసాపురం: శ్రీవైఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్, బయో టెక్నాలజీ విభాగం, సామాజిక సేవా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని నిర్వహించారు. గత కొన్ని రోజులుగా వేములదీవి గ్రామంలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా మధుమేహ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు మాట్లాడారు. అనంతరం గ్రామస్తులకు మధుమేహ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ గంధం శ్రీ రామకృష్ణ, సామాజిక సేవా విభాగ సమన్వయకర్త బి.ప్రసాద్, బయో టెక్నాలజీ విభాగాధిపతి జి.శ్యాంబాబు, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారులు చింతా సోమేశ్వరి, ఎస్.యాకోబు పాల్గొన్నారు.

పాలకొల్లు : విద్యార్థులు శరీరక శ్రమ ఉండేలా ఆటల్లో పాల్గొనాలని సీనియర్ వైద్యులు రేగులపాటి సంతోష్ కుమార్ చెప్పారు. బాలల దినోత్సవం, షుగర్ డే సందర్భంగా పాలకొల్లు యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఉల్లంపర్రు మాంటిస్సోరి స్కూల్లో డాక్టర్ రేగులగడ్డ సంతోష్ కుమార్‌చే విద్యార్థులకు షుగర్ వ్యాధిపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం జరిగింది. క్లబ్ గవర్నర్ పెనుమాక రామ్మోహనరావు, అధ్యక్షులు కానూరి ప్రభాకర్, జి.వీరాస్వామి, పాస్యావుల రవి, కె.సుబ్రహ్మణ్యం, మంగిన సాయి, ఉనికెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాల్యం నుండి భవిష్యత్తుకు పునాది వేసుకోవాలి : ఎంఎల్ఎ

తాడేపల్లిగూడెం: చిన్నతనం నుండే చదువు పట్ల మక్కువతో మెలగాలని తద్వారా బాల్యం నుండి మెరుగైన భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పెంటపాడు ఎస్ఐ స్వామి తన సొంత నిధులు కేటాయించి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటుచేసిన నూతన లైబ్రరీని ఎంఎల్ఎ శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించి సొంత నిధులు లైబ్రరీ ఖర్చుల నిమిత్తం 8 వేల రూపాయలు అందజేశారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేసి మాట్లాడారు.

ముగిసిన టెన్నిస్ పోటీలు

పాలకొల్లు : పాలకొల్లు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో 8వ తేదీ నుంచి నిర్విరామంగా జరుగుతున్న సిహెచ్ బుద్ధ అవతారం రాజు మెమోరియల్ ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. పాలకొల్లు, కాస్మో కల్చర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ కోర్టులో సింగిల్స్ డబల్ విభాగాల్లో ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా జరిగినట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ భగవాన్‌రాజు విలేకర్లకు తెలిపారు. విజేతలకు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో అధ్యక్షుడు గొట్టముక్కల గాంధీ భగవాన్ రాజు అధ్యక్షతన ముఖ్య అతిథులుగా మాజీ ఎంఎల్ఎ ముదునూరి ప్రసాద్ రాజు, పాలకొల్లు ఎఎంసి ఛైర్మన్ కోడి విజయభాస్కర్ బహుమతులను అందించారు.

రాజగోపాల స్వామి ఆలయ కమిటీ ప్రమాణం

మొగల్తూరు: యాత్రికులకు మెరుగైన సేవలు అందించాలని విప్ బొమ్మిడి నాయకర్ నూతన పాలకవర్గ సభ్యులకు సూచించారు. కెపి.పాలెం సౌత్ లో ఉన్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ రాజగోపాల స్వామి వారి దేవస్థాన నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం ఆలయం ఛైర్మన్‌గా మల్లిపూడి సూర్య జ్యోతి, పలువురు సభ్యులకు ప్రమాణస్వీకారం చేయించారు. సర్పంచులు అందె వెంకటలక్ష్మి, కడలి సోంబాబు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి, ఎంపిటిసి అందె దొరబాబు, కొల్లాటి గోపి ల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయనది

నూప మధుసూదన్ బాబు, తండ్రి జోగారావు, డోర్ నెంబర్ 1- 95, బూసరాజుపల్లి గ్రామం, బుట్టాయిగూడెం మండలం, ఏలూరు జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను వైజాగ్ పాస్‌పోర్ట్ ఆఫీస్ నుంచి **J2327895** నెంబర్ పాస్‌పోర్ట్ పొంది యున్నాను. ది.**03-11-2025**న మా ఇంటి నుంచి ఏలూరు వస్తుండగా సోమవరప్పాడు వద్దకు వచ్చేసరికి నా బ్యాగులోని నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ కనిపించలేదు. వెనక్కి వెళ్లి రోడ్డుకి ఇరువైపులా ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు. ఎవరికైన దొరికిన పై నా అడ్రస్‌కు నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ అందజేయగలరు.
సెల్:- 9989404076